కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసరావుకు డి.లిట్ ప్రదానం



హైదరాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు ప్రతిష్ఠాత్మక డి.లిట్ లభించింది. భారతీయ భాషలకు, సాహిత్యానికి విశేష సేవలందించినందుకు, అకాడమీని అభివృద్ధి పథంలో నడిపినందుకు గాను ఈ డిగ్రీ ప్రదానం చేస్తున్నట్లు మహేంద్రకర్మ విశ్వవిద్యాలయం ప్రకటించింది. ఛత్తీస్‌గఢ్ జగదల్పూర్‌లోని ఈ విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, శ్రీనివాసరావుకు డి.లిట్ ప్రదానం చేశారు.

అన్ని పార్టీలు బీసీలకు 9 ఎంపీ సీట్లు కేటాయించాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

బర్కత్‌పుర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 9 ఎంపీ సీట్లు కేటాయించాలని, లేదంటే ఆ పార్టీల భరతం పడతామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ జనగణనలో కులాల వారీగా బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం గత బడ్జెట్‌లో 2 వేల 150 కోట్ల రూపాయలను మాత్రమే కేటాయించి బీసీలకు అన్యాయం చేసిందన్నారు. 75 కోట్ల బీసీ జనాభాకు ఆ నిధులు ఏ మూలకు సరిపోవని అన్నారు. దేశంలో బీసీ యువజన సంఘాన్ని బలోపేతం చేయడానికి రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే కర్ణాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి, యూపీ, బిహార్ రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేశామని మిగతా రాష్ట్రాల కమిటీలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో ఫీజురీయింబర్స్‌మెంట్ స్కీమ్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, సుధాకర్ ముదిరాజ్, రామకృష్ణ, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మేడి పాపయ్య మాదిగ

మాదిగలకు మూడు ఎంపీ స్థానాలను కేటాయించాలి

బర్కత్‌పుర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో మూడు ఎంపీ స్థానాలను మాదిగలకు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ డిమాండ్ చేశారు. వరంగల్, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి స్థానాలను అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ యువసేన రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. యువసేన రాష్ట్ర కో-ఆర్డినేటర్ మంచాల యాదగిరి మాదిగ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పాపయ్య మాట్లాడుతూ ఎంపీ స్థానాల సాధనకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు పులిజాల గెల్వయ్య, యాదయ్య, మేడి రమణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

క్రాఫ్ట్ టీచర్ పోస్టులను భర్తీ చేయాలి: యాదస్వామి

హైదరాబాద్ సిటీ, మార్చి5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న క్రాఫ్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ క్రాఫ్ట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిప్పారపు యాదస్వామి సీఎంను కోరారు. రాష్ట్రంలో గత 30ఏళ్లలో 9సార్లు జరిగిన డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో ఒక్కసారి కూడా క్రాఫ్ట్ టీచర్ లేదా ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను ప్రకటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లోనైనా క్రాఫ్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను ప్రకటించి, నిరుద్యోగ క్రాఫ్ట్ టీచర్లను ఆదుకోవాలని సీఎంకు ప్రజాభవన్‌లో విజ్ఞప్తి చేశారు.

మహా శివరాత్రి సందర్భంగా...

ఏడుపాయలకు 113 ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

చాదర్‌ఘాట్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆర్టీసీ హైదరాబాద్ సిటీ రీజియన్ సీబీఎస్ నుంచి ఏడుపాయలకు 113 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు రీజినల్ మేనేజర్ వరప్రసాద్ తెలిపారు. ఈనెల 7 నుంచి 11వతేదీ వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆయన వివరించారు. 7వ తేదీన 8 బస్సులు, 8న 20 బస్సులు, 9న 40 బస్సులు, 10న 40 బస్సులు, 11న 5 బస్సులను నడపడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. ఏడుపాయలకు వెళ్లే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షా ఫలితాలు విడుదల

- 7వ తేదీలోగా రీ వాల్యుయేషన్‌కు అవకాశం

కుషాయిగూడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి బోర్డు (ఎస్‌బీటీఈటీ) ఆధ్వర్యంలో గత జనవరిలో నిర్వహించిన టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షల ఫలితాలు సోమవారం రాత్రి విడుదలయ్యాయి. అభ్యర్థులు ఎస్‌బీటీఈటీ.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఫలితాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదేవిధంగా రీ వాల్యుయేషన్, ఆన్సర్ షీట్ కాపీలు కావాల్సిన వారు ఈ నెల 7లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌బీటీఈటీ సెక్రటరీ పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాధానపత్రాల నకలు కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ.100, రీ వాల్యుయేషన్ కోసం సబ్జెక్టుకు రూ.750 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. కాగా, జూన్‌లో నిర్వహించే టైప్ రైటింగ్/షార్ట్‌హ్యాండ్ పరీక్షల కోసం త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు.

అర్ధరాత్రి తర్వాత తీవ్ర శబ్దకాలుష్యంపై పిటిషన్

హైదరాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ తాడ్‌బండ్ ప్రాంతంలో బంటియా గార్డెన్స్, ఇంపీరియల్ గార్డెన్స్ ఫంక్షన్ హాళ్ల ద్వారా అర్ధరాత్రి 12 తర్వాత కూడా తీవ్రమైన శబ్దకాలుష్యం జరుగుతోందని మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీస్‌కు చెందిన అడిషనల్ చీఫ్ ఇంజినీర్ జె సతీశ్ భరద్వాజ హైకోర్టుకు లేఖరాశారు. ఈ లేఖను సుమోటోగా స్వీకరించిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం.. ఈ వ్యవహారంపై వివరాలు తెలియజేయాలని అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్‌కు మంగళవారం ఆదేశాలు జారీచేసింది. అలాగే ఈ పిటిషన్‌లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డును ఇంప్లీడ్ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. కేవలం రూ.10 వేలు జరిమానా వేసి వదిలేస్తే పరిస్థితులు ఏమీ మారవని ధర్మాసనం వ్యాఖ్యానించింది. శబ్దకాలుష్య నియంత్రణకు 2010లో జారీచేసిన జీవో నం.170 నిబంధనలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని.. పదోతరగతి పరీక్షలు ఉన్న నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ ఈ నెల 7కు వాయిదా వేసింది.

వాటర్‌ప్లాంట్ల జలచౌర్యంపై పిటిషన్..

ప్రభుత్వ అండర్‌గ్రౌండ్ వాటర్ పైప్‌లైన్ నుంచి వాటర్‌ప్లాంట్ యజమానులు నీటిని చోరీ చేస్తున్నారని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కాచిగూడ శ్మశానవాటిక వద్ద శిల్పా వాటర్‌ప్లాంట్ యజమానులు ప్రభుత్వ పైప్‌లైన్ నుంచి నీటిని చోరీచేస్తున్నారని ఉస్మాన్‌గంజ్‌కు చెందిన మొహమ్మద్ సల్మాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనికి రిజిస్ట్రీ నంబర్ ఇవ్వకపోవడంతో రెగ్యులర్ నంబర్ ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. వాటర్‌ప్లాంట్ యజమానులు సహా మున్సిపల్, జీహెచ్ఎంసీ, నీటిపారుదల, పోలీసుశాఖలు, జిల్లా కలెక్టర్‌కు వివరణ ఇవ్వాలని నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ నాలుగువారాలకు వాయిదాపడింది.



మాదాపూర్‌లోని మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్‌లో 'మైండ్‌స్పేస్ పవర్‌టాక్స్' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న భారత మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్

గడువులోగా పన్ను వసూలు చేయాలి: జడ్‌సీ



అధికారులతో సమావేశమైన జోనల్ కమిషనర్ స్నేహ షబరీష్

- సకాలంలో పన్ను చెల్లించి రాయితీ పొందాలి

గచ్చిబౌలి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో ఆస్తిపన్ను చెల్లింపుదారులంతా సకాలంలో పన్ను చెల్లించి జీహెచ్ఎంసీ అభివృద్ధికి సహకరించాలని జోనల్ కమిషనర్ స్నేహ షబరీష్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆస్తిపన్ను వసూళ్లకు మార్చి 30 ముగుస్తుండటంతో ఆలోపు చెల్లింపుదారులు పన్ను చెల్లించాలని ఆమె కోరారు. మంగళవారం జోనల్ పరిధిలోని పటాన్‌చెరు, చందానగర్, శేరిలింగంపల్లి, యూసఫ్‌గూడ సర్కిల్ అధికారులు, ఉపకమిషనర్లతో ఆస్తిపన్నుపై రివ్యూ సమావేశం నిర్వహించారు. బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలోని చెల్లింపుదారులపై ఒత్తిడి తీసుకొచ్చి వసూళ్లు చేయాలని సూచించారు. గడువులోగా పన్నులు చెల్లించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలోపు అందరూ పన్నులు చెల్లించాలన్నారు. అధికారులు, సిబ్బంది పన్నుల వసూళ్లలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని అవసరమయితే పన్నుదారులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీ రజనికాంత్‌రెడ్డి, వంశీ, సురేష్, సేవస్లవంత్‌తో పాటు ఆయా సర్కిళ్ల ఎఎంసీలు, ట్యాక్స్‌ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లు పాల్గొన్నారు.

2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం పన్ను ఒకేసారి చెల్లించి 90 శాతం వడ్డీ రాయితీ పొందవచ్చని జోనల్ కమిషనర్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి 31న ముగుస్తుండడంతో ఆలోపు పన్ను చెల్లించిన వారికే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద 90 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందని తెలిపారు.

పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం

కూకట్‌పల్లి: జీహెచ్ఎంసీలో పని చేసే పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ తెలిపారు. మూసాపేట ఆంజనేయనగర్ కమ్యూనిటీహాల్‌లో మంగళవారం పారిశుధ్య కార్మికులకు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత అంశాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్మికులు పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉంటేనే సక్రమంగా పని చేయగలరని వివరించారు. పరిసరాలను శుభ్రం చేసే ప్రక్రియలో భద్రతాపరమైన పరికరాలు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో న్యూట్రీషన్ అధికారులు డా.మహేశ్వర్, డా.సిల్వియా, డా.రాజేందర్‌రావు, డా.శిరీష, డా.ఛాయాదేవి, జీహెచ్ఎంసీ అధికారులు డా.పద్మజ, రమేష్, మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, డా.సాల్మన్ రాజ్, భార్గవనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్సీ అభిలాష అభినవ్



శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్

అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన

మియాపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సమ్ టోటల్ సీఎస్ఆర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మియాపూర్ డివిజన్ న్యూ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణం పనులను ఎమ్మెల్యే అరెకపూడిగాంధీ, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమ్‌టోటల్ సీఎస్ఆర్ ప్రాజెక్ట్ పేద విద్యార్థులు, ప్రజల కోసం సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఉషశ్రీ, ఇన్‌చార్జి హెచ్ఎం రామ్మోహన్‌రావు, ఉపాధ్యాయులు అర్చన, విజయ, వనజ, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో జాగ్రత్తలు పాటించాలి

కూకట్‌పల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. కూకట్‌పల్లి డివిజన్ శేషాద్రినగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనుల కారణంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీటి పైపులైన్లు ధ్వంసమయ్యాయనే విషయం తెలుసుకొన్న ఆయన మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. వెంటనే పైపులైన్ల నిర్మాణం పూర్తి చేసిన తర్వాత రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అభివృద్ధి పనులను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఇటువంటి తప్పిదాలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు.



శేషాద్రినగర్‌లో పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం



విద్యార్థులకు హెల్మెట్లు అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్, సేవా సంస్థ ప్రతినిధులు

విద్యార్థులకు హెల్మెట్ల పంపిణీ

గచ్చిబౌలి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతియేటా రోడ్డు ప్రమాదాల బారినపడి సుమారు రెండు లక్షల మంది చిన్నారులు మృతి చెందుతున్నారని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ విచారం వ్యక్తం చేశారు. మంగళవారం నల్లగండ్లలోని ప్రాథమిక పాఠశాలలో ఎస్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెల్మెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు హెల్మెట్లు అందజేశారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలని, దీని కారణంగా ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం తప్పించొచ్చని తెలిపారు. సేవా సమితి ప్రతినిధులు బేగ్ తదితరులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



అభినందన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

ప్రజా నాయకుడికి ఓటమి ఉండదు

గాజులరామారం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం కోసం పని చేసే నాయకుడికి ఓటమి ఉండదని, ఈ విషయాన్ని కుత్బుల్లాపూర్ ప్రజలు నిరూపించారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్ ఓం మణికంఠ నాయీబ్రాహ్మణ సేవా సంఘం వారు నిర్వహించిన అభినందన సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కుల సంఘాల అభివృద్ధి, అభ్యున్నతికి ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. రానున్న రోజుల్లో నాయీబ్రాహ్మణ సేవాసంఘం అభివృద్ధికి తన సహాయసహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శేషగిరి, శ్రీనివాస్‌యాదవ్, బాలరాజ్, ఎండీ మక్సూద్, ఎల్లగౌడ్, వెంకటేశ్వర్లు, వెంకటేష్ పాల్గొన్నారు.

దేశ ఆర్థిక పురోభివృద్ధిలో ఎంఎస్ఎంఈ పాత్ర అనిర్వచనీయం

బాలానగర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక పురోభివృద్ధికి, ఉపాధి కల్పనలో మైక్రోస్మాల్ అంత్రప్రెన్యూర్స్ డెవలప్‌మెంట్ (ఎంఎస్ఎంఈ) సంస్థ పారిశ్రామిక రంగానికి ఎంతో దోహదపడుతోందని కమిషనర్ ఆఫ్ ఇండస్ట్రీస్ అడిషనల్ డైరెక్టర్ రాజ్‌కుమార్, ఎంఎస్ఎంఈ అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ డి.చంద్రశేఖర్ అన్నారు. మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ అందిస్తున్న స్కీంలపై ఎంఎస్ఎంఈ, మరికొన్ని సంస్థలతో కలిసి నగరంలోని తారామతి బారాదరిలో ఏర్పాటు చేసిన ఒక్కరోజు అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై స్వాగతోపన్యాసం చేసి ఎంఎస్ఎంఈ స్కీంల గురించి వివరించారు. రాబోయే నాలుగేండ్ల ర్యాంప్ పథకం కింద ఎంఎస్ఎంఈ రంగానికి మద్దతు ఇవ్వడానికి తెలంగాణ ప్రభుత్వానికి రూ.46.95 కోట్లు ఇప్పటికే విడుదల అయ్యాయన్నారు. విశ్వకర్మ పథకం వలన రాష్ట్రంలోని చేతివృత్తుల వారికి ఎంతో మేలు జరుగుతుందని ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ప్రభుత్వానికి రూ.117.95 కోట్ల గ్రాంటును కేటాయించిందని వివరించారు. అనంతరం సిడ్బీ బ్యాంకు జీఎం హిమాన్షు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్, ఎస్ఎల్‌బీసీ మేనేజర్ శ్రీహరి, తెలంగాణ ఇండస్ట్రీయల్ ఫెడరేషన్ అధ్యక్షుడు సుధీర్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. కొత్త ఐటీ చట్టం, ఎలా తగ్గింపు పొందాలి, అవసరమైన పత్రాల వెరిఫికేషన్, జీఎస్టీ సహాయ్, ఆన్‌లైన్ ఆధారిత ప్రోగ్రాంలు, బ్యాంకులు అందిస్తున్న సేవలను, సహాయ సహకారాలను వివరించారు. ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ శివరామ్‌ప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పారిశ్రామికవేతలు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చంద్రశేఖర్



ఏసీపీ శ్రీనివాసులును అభినందిస్తున్న పారిశ్రామికవేత్తలు

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

జీడిమెట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు అన్నారు. జీడిమెట్ల సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఐలా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, ఐలా కమిషనర్ నజీర్‌అహ్మద్ మాట్లాడారు. పారిశ్రామికవాడలో 150 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ఐలా నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఏఎల్ఎన్‌రెడ్డి, సాయికిషోర్, కృష్ణ, ఇందుకూరి భాస్కర్‌రాజు పాల్గొన్నారు.

నాలుగో ఫేజ్‌లో ఆలయాల తొలగింపు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ నాలుగోఫేజ్‌లో సేవాలాల్ మహరాజ్, మరియమ్మ విగ్రహాల తొలగింపు ఉద్రిక్తతకు దారితీసింది. బంజారాలు నాలుగేళ్లుగా పూజలు చేసుకుంటున్న విగ్రహాలను ముందస్తు సమాచారం లేకుండా తొలగించడం బాధాకరమని నాలుగోఫేజ్ బంజారాలు మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయాన్ని కూల్చేసి తమ ఉనికి లేకుండా హౌసింగ్‌బోర్డు అధికారులు చేశారని వాపోయారు. హౌసింగ్‌బోర్డు ప్లాట్స్ ఉద్యోగుల విజ్ఞప్తి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రపోజల్ రోడ్డుపై ఉన్న రెండు విగ్రహాలను తొలగించామని ఈఈ కిరణ్‌బాబు తెలిపారు.



ఆలయం తొలగించిన ప్రాంతం

సీఐ వెంకటేశ్వరరావుకు ఘనంగా వీడ్కోలు

గాజులరామారం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సూరారం సీఐగా బాధ్యతలు నిర్వహించిన వెంకటేశ్వరరావు కేపీహెచ్‌బీకి బదిలీపై వెళ్లారు. వెంకటేశ్వరరావును స్టేషన్ సిబ్బంది పూలబొకే, శాలువాలతో సత్కరించి, పూలవర్షం కురిపిస్తూ మంగళవారం వీడ్కోల్ పలికారు. సూరారం పోలీస్ స్టేషన్ ప్రారంభం నుంచి సీఐగా ఉంటూ, ఆయన సూచనలతో క్లిష్టమైన కేసులను చాకచక్యంగా ఛేదించామని సిబ్బంది గుర్తు చేసుకున్నారు.



సీఐ వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న సిబ్బంది

- ఈటలకు ఆహ్వానం



జగద్గిరిగుట్ట మల్లికార్జున స్వామి భ్రమరాంబిక కేతమ్మ కల్యాణ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర నాయకులు ఈటల రాజేందర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి కరపత్రం అందిస్తున్న జేకే శేఖర్ యాదవ్, తదితరులు.

\- జీడిమెట్ల ఆంధ్రజ్యోతి

'హౌసింగ్‌బోర్డు ప్లాట్లను కాపాడండి'

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ ధర్మారెడ్డికాలనీ ఫేజ్-2లో ఖాళీగా ఉన్న హౌసింగ్‌బోర్డు ప్లాట్లు కబ్జాకు గురవుతున్నాయని వాటిని కాపాడాలని సీఎస్‌కు మంగళవారం సీపీఐ నాయకులు శివప్రసాద్ రిజిస్టర్ పోస్టు ద్వారా విజ్ఞప్తి చేశారు. ఆరు ప్లాట్లు ఖాళీగా ఉన్నాయని, వాటిలో ప్లాట్ నంబర్ 74లో దేవాలయం నిర్మించారని, దాని ముందు ఉన్న 73 ప్లాట్ కబ్జా చేశారని, గుడి వెనకాల ఉన్న 75 కూడా కబ్జా చేసే ప్రయత్నాల్లో ఉన్నారని సీఎస్‌కు పంపిన లెటర్‌లో పేర్కొన్నారు. కోట్ల రూపాయల విలువైన స్థలం కబ్జాకు హౌసింగ్‌బోర్డు మాజీ ఉద్యోగి సత్యనారాయణ పావులు కదుపుతున్నాడని ఆరోపించారు. కబ్జాలను అరికట్టాలని పక్షంలో హైకోర్టులో పిల్ వేస్తామని పేర్కొన్నారు. సీఎస్‌తో పాటు హౌసింగ్‌బోర్డు ఛైర్మన్, ఈఈకు కూడా పంపించినట్లు శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

సంక్షిప్త వార్తలు

దోమల మందు పిచికారి

హైదర్‌నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ టీఎంఆర్ స్కూల్, జూనియర్ కళాశాల బాయ్స్-1లో దోమల బెడద ఎక్కువగా ఉందని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన ఆయన మంగళవారం ఎంటమాలజీ సిబ్బందితో కలిసి కళాశాలను పరిశీలించారు. అనంతరం దోమల మందు పిచికారి చేయించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్‌వైజర్ నర్సింహులు, శానిటేషన్ సూపర్‌వైజర్లు భరత్, రాజేష్, శ్రీకాంత్, ప్రిన్సిపాల్ శైలజ, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగతి డిగ్రీ కాలేజీ వార్షికోత్సవం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన ప్రగతి డిగ్రీ కళాశాల ఫెయిర్ వెల్ డే కూకట్‌పల్లిలోని అశోకా గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సాంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకొన్నారు. అనంతరం ఫైనల్ ఇయర్ విద్యార్థినుల ర్యాంప్ వాక్ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో కరస్పాండెంట్ రవీందర్ రావు, ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర ఆలయ వార్షికోత్సవం

షాపూర్‌నగర్: మహాశివరాత్రిని పురస్కరించుకొని సూరారం ఉమామహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం నేటి నుంచి ప్రారంభంకానున్నట్లు ఆలయ ధర్మకర్త ముద్దాపురం మదన్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈయేడూ వార్షికోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించే వార్షికోత్సవంలో పూజాకార్యక్రమాలతో పాటు స్వామివారి కల్యాణం, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సంత్ శిరోమణి రవిదాస్ మహారాజ్‌కు నివాళి

ఫతేనగర్: సంత్ శిరోమణి రవిదాస్ మహారాజ్ సేవలు మరువలేనివని కార్పొరేటర్ సతీష్‌గౌడ్ అన్నారు. రవిదాస్ మహారాజ్ 647 జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కంబ్లే లక్ష్మణ్, సంజీవ, సుధాకర్ జైన్, తుకారామ్ ధన్‌రాజ్ పాల్గొన్నారు.

టీడీపీని కేసీఆర్ గుర్తుచేసింది అందుకోసమే..!

హైదరాబాద్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): నిజాయితీగా, అంకితభావంతో ఉన్నందుకే తమ పార్టీని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గుర్తు చేశారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింలు వ్యాఖ్యానించారు. టీడీపీ ఎమ్మెల్యేలు 15 మందిని గతంలో బీఆర్ఎస్‌లోకి తీసుకున్న కేసీఆర్, ఈరోజు తెలుగుదేశం పార్టీని చూసి నేర్చుకోవాలని అంటున్నారు. 20 ఏళ్లుగా అధికారంలో లేకున్నా పార్టీలో కొనసాగుతున్న కార్యకర్తలను చూసి కేసీఆర్ నేర్చుకోమన్నారేమో! అని బక్కని అభిప్రాయపడ్డారు. మంగళవారం ఎన్టీఆర్ భవన్‌లో వెలివెల దుర్గారావు అధ్యక్షతన టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం 63 మంది కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేసింది. నన్నూరి నర్సిరెడ్డి, బండి పుల్లయ్య, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు జేఎన్‌టీయూలో 'ఫార్మా అన్వేషణ్' సదస్సు

హైదరాబాద్ సిటీ, మార్చి5 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఔషధ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని జేఎన్‌టీయూలో 'ఫార్మా అన్వేషణ్' పేరిట జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీతారెడ్డి తెలిపారు. ఫార్మసీ కళాశాలల్లో జాతీయ విద్యావిధానం అమలు లక్ష్యంగా, భారత ఔషధ మండలి, జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగుతుందని చెప్పారు. సదస్సులో ప్రధాన వక్తలుగా, జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి, ఫార్మసీ రంగ నిపుణులు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ వి.ప్రభాకర్‌రెడ్డి, అనిల్‌కుమార్ గాంధీ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. వర్సిటీ ప్రాంగణంలోని జేఎన్ ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో రాష్ట్రంలోని పలు ఫార్మసీ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు, పలువురు పారిశ్రామికవేత్తలు హాజరవుతారని తెలిపారు.



స్థల వివాదం.. ఇరువురిపై కేసు

దుండిగల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బహదూర్‌పల్లి గ్రామం సందయ్యకుంట ప్రాంతంలో సర్వేనెంబరు 63, 62లోని ప్లాట్ల విషయంలో ఇద్దరు ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో దుండిగల్ పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేశారు. సర్వేనెంబరు 63లో ప్లాట్ నెం 19లో 169 గజాల స్థలాన్ని కౌన్సిలర్ సత్యనారాయణ కొన్ని సంవత్సరాల క్రితం కొనుగోలు చేశాడు. ఆయనతో పాటు సర్వేనెంబరు 62లో 240 గజాలు షేక్ సర్దార్ అనే వ్యక్తి కూడా కొనుగోలు చేసి ఇరువురు ప్రహరీ నిర్మించారు. ఈ విషయాన్ని గమనించిన ప్రవీణ్ పటేల్, చేతన్ పటేల్, సైలేందర్‌పటేల్ అనే ముగ్గురు వ్యక్తులు ఈ ప్లాట్ల డాక్యుమెంట్లు తమ వద్దే ఉన్నాయని, స్థలం తమదేనంటూ రాత్రికిరాత్రే ఆ ప్రహరీ, గేట్లను కూల్చి వేయించారు. అంతే కాకుండా కోర్టుకు వెళ్లి, ఆ స్థలంలోకి ఎవరూ రావొద్దని ఆదేశాలు కూడా తెచ్చుకోవడంతో పాటు, సత్యనారాయణ, షేక్‌సర్దార్‌లకు సంబంధించిన ప్లాట్లలోకి వేళ్లే రోడ్డుపై పెద్ద కంటైనర్ పెట్టి బ్లాక్ చేశారు. తమ స్థలంలో ప్రహరీని కూల్చి రోడ్డును బ్లాక్ చేయడంతో పాటు బౌన్సర్లని ఏర్పాటు చేసుకొని తమను బెదిరిస్తున్నారని సత్యనారాయణ, షేక్‌సర్దార్‌లు దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా పవీణ్ పటేల్ కూడా ప్లాట్లు తమకు చెందినవేనని పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు ఫిర్యాదులు స్వీకరించిన దుండిగల్ పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేశారు. ఇలాంటి వివాదాలు తమ పరిధిలోకి రావని, ఘర్షణ పెట్టుకుంటే జైలుకు వెళ్లాల్సి వస్తుందని సీఐ శంకరయ్య వారిని హెచ్చరించి పంపించారు.



ఆందోళ వ్యక్తం చేస్తున్న సత్యనారాయణ, షేక్ సర్దార్



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

అక్రమ నిర్మాణాల తొలగింపు

గచ్చిబౌలి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మండలం పరిధిలోని కంచిగచ్చిబౌలిలో మసీద్‌బండ వద్ద రోడ్డు విస్తర్ణ కోసం ఎస్‌బీఐ బ్యాంకు చెందిన స్థలం వదిలేశారు. ఈ స్థలాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేశారు. ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. కంచ గచ్చిబౌలి సర్వేనెంబర్ 26లోని ప్రభుత్వ స్థలంలో ఓ వ్యక్తి భారీ ప్రహరీ, షెడ్డు నిర్మిస్తుండగా తహసీల్దార్ వెంకారెడ్డికి ఫిర్యాదు రావడంతో అధికారులు అప్రమత్తం చేసి తొలగించినట్లు ఆయన తెలిపారు. ఆర్ఐ రాంబాబు ఆధ్వర్యంలో ప్రహరీ, షెడ్డును నేలమట్టం చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.